క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంగం: మండలంలోని సిద్దీపురం సబ్‌స్టేషన్‌లో పరిధిలోని 11 కేవీ మర్రిపాడు ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఉడతా మన్మధరావు గురువారం తెలిపారు. నూతన విద్యుత్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నందున ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 2.15 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. రైతులకు త్రీఫేస్ సరఫరాను ఉదయం 4.15 నుంచి 9.15 గంటల వరకు, మధ్యాహ్నం 2.15 నుంచి 6.15 గంటల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం



ఆత్మకూరు: పట్టణంలోని చావడి ప్రాంతానికి చెందిన షేక్ షాన్‌వాజ్ ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో ఆత్మకూరు లయన్స్ క్లబ్ నిర్వాహకులు గురువారం రూ.10వేలు సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ



కావలి: పుల్లారెడ్డినగర్‌కు చెందిన సమాధి కృష్ణ తల్లి మరణించిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి గురువారం పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ప్రిన్స్ యూత్‌కు ప్రశంసలు



కావలి: దగదర్తి మండలం శ్రీరామాపురం పంచాయతీకి చెందిన ప్రిన్స్ యూత్ అసోసియేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ప్రశంసలు లభించాయి. ప్రపంచ వలంటీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని నెహ్రూ యువకేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్స్ యూత్ అధ్యక్షుడు కృష్ణయ్యకు జిల్లా యూత్ ఆఫీసర్ మహేంద్రారెడ్డి ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు.

నేడు కావలిలో జాబ్‌మేళా

కావలి: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసు, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత కోసం శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ ఖయ్యూం, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వినయ్‌కుమార్, విక్రమ సింహపురి వర్సిటీ పీజీ సెంటర్ ప్రిన్సిపల్ తెలిపారు. పట్టణంలోని విక్రమ సింహపురి వర్సిటీ పీజీ సెంటర్ ప్రాంగణంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా జరుగుతుందని చెప్పారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, ముత్తూట్, బ్లూస్టార్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు కంపెనీలు హాజరవుతాయని చెప్పారు. ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో, బీటెక్ చదివిన నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 63015 43185,72868 22789 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మహిళా లోకానికే అవమానం

కావలి: గండిపాళెంలో మద్యం షాపు ఏర్పాటుకు మహిళలను ముందుంచి డిమాండ్ చేయించడం మహిళా లోకానికే అవమానమని అని సామాజిక కార్యకర్త, విశ్రాంత హెచ్‌ఎం సీ శారద గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సారా నిషేధ ఉద్యమ యోధులు సింహపురి మహిళలని, తాగివచ్చి తమను చిత్రహింసలకు గురిచేసే మగవారి కోసం మద్యం షాపు పెట్టాలని ఎవరూ డిమాండ్ చేయరన్నారు. గండిపాళెంలో కొందరు స్వార్థపరులు మహిళలను వాడుకోవడం అత్యంత గర్హనీయమన్నారు. దీనిని మద్యాన్ని వ్యతిరేకించే ప్రజాతంత్రవాదులు, మహిళలు తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు.

13 మద్యం సీసాలు స్వాధీనం

బిట్రగుంట: బోగోలు మండలం సుందరగిరివారి కండ్రిగలో మద్యం అనధికారికంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. పెనమాల మహేశ్వరి వద్ద 13 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

దెబ్బతిన్న నారుమళ్లు

చేజర్ల: మండలంలో గత మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరినాట్లు, నారుమళ్లు నీట మునిగి దెబ్బతిన్నాయి. పాడేరు, యనమదల, తూర్పుపల్లె, పెళ్లేరు, పులనీళ్లపల్లి, పెన్నా పరీవాహక గ్రామాల్లో నారుమళ్లు పూర్తిగా నీట మునిగాయి. యనమదలలో దాదాపు 70 ఎకరాలకు సరిపడా నారుమడులు నీట మునిగాయని రైతులు తెలిపారు. నల్లవాగు పొంగడం, అటవీ ప్రాంతం వరద నీరు రావడంతో ఈ పరిస్థితి నెలకొందని రైతులు వాపోయారు.

అన్నదాతను ముంచిన వర్షాలు

మండలంలో 3వేల ఎకరాల్లో నాట్లు, నారుమళ్లు మునక

- బ్రాహ్మణక్రాకలో ఆక్రమణలతో కుచించుకుపోయిన పిల్లివాగు
- వాగు పొంగడంతో మునిగిన పంట పొలాలు





బ్రాహ్మణక్రాకలో మునిగిన పంట పొలాలు, ఆక్రమణలతో కుంచించుకుపోయిన పిల్లివాగు

జలదంకి: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలు అన్నదాతలను ముంచాయి. వర్షాలకు వేసుకున్న నాట్లతో పాటు నారుమళ్లు దెబ్బతినడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో రబీ సీజన్‌లో అధికంగా వరి పంట సాగు చేస్తారు. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవడంతో రైతులు ముందుగా నారుమళ్లు సిద్ధం చేసుకుని కొంతమేర నాట్లు కూడా వేసుకున్నారు. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. దీంతో నారుమళ్లు పూర్తిగా పాచిపోయి మళ్లీ సిద్ధం చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. నాట్లు వేసిన పొలాలు సైతం నీట మునిగిఉన్నాయి. పొలాల్లో నుంచి నీరు పూర్తిగా వెళ్లిన తరువాతే నాట్ల పరిస్థితి తెలుస్తుందని రైతులు వాపోతున్నారు. జలదంకి మండలంలో దాదాపు 3వేల ఎకరాల్లో నారుమళ్లు, నాట్లు దెబ్బతిన్నట్లుగా రైతులు చెబుతున్నారు.

బ్రాహ్మణక్రాకలో పిల్లివాగు ఆక్రమణలతో

బ్రాహ్మణక్రాకలో పిల్లివాగు నీరు పొలాలను ముంచెత్తడంతో దాదాపు 500 ఎకరాల్లోని నారుమళ్లు, నాట్లు మునిగాయి. గ్రామంలోని నాయుడు చెరువు, పేరపనాయుడు చెరువు కలుజుల నీరు పిల్లివాగు ద్వారా దిగువకు ప్రవహిస్తుంది. గతంలో భారీ వర్షాలు కురిసి కలుజులు ఉధృతంగా ప్రవహించినా వాగులో నీరు సజావుగా వెళ్లేంది. ఇటీవల పిల్లివాగును దాని సమీపంలో పొలాలు కలిగిన వారు ఆక్రమించడంతో కుచించుకుపోయింది. దీంతో భారీ వర్షాలు కురిస్తే వాగు పొంగి పంట పొలాలు మునిగిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. వాగు ఆక్రమణల విషయాన్ని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి ముంపు సమస్యకు పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు. అలాగే వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి నీట మునిగిన పంటను పరిశీలించి నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నాట్లు, నారుమళ్లు మునిగాయి



తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు వరి నాట్లతో పాటు నారు మడులు నీట మునిగాయి. ప్రతిరోజూ నీరు తొలగిస్తున్నా మళ్లీ వర్షం పడుతోంది. ఇక పంట పోయినట్టే. ఇప్పటికే ఎకరాకు రూ.10 వేల వరకు ఖర్చు పెట్టాం. వ్యవసాయాధికారులు నీట మునిగిన పొలాలను పరిశీలించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి.
–ముచ్చాల మధుసూదన్‌రెడ్డి, రైతు, బ్రాహ్మణక్రాక

వాగు ఆక్రమణలను తొలగించాలి



పిల్లివాగు ఆక్రమణలతో కుచించుకుపోవడంతో పంట పొలాలను వర్షపు నీరు ముంచెత్తింది. నేను పదెకరాల్లో నాట్లు వేయగా పూర్తిగా మునిగాయి. నారుమడి కూడా దెబ్బతింది. ఏటా వాగు ఆక్రమణలకు తొలగించాలని రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలి.
– పొనుగోటి సుబ్బారెడ్డి, రైతు, బ్రాహ్మణక్రాక

పాలిటెక్ ఫెస్ట్ ప్రారంభం

కావలి: రుద్రకోట వద్ద జాతీయ రహదారి పక్కనున్న కావలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నెల్లూరు రీజియన్ పాలిటెక్ ఫెస్ట్–2024 గురువారం ప్రారంభమైంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 170 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్, కంప్యూటర్ ఇంజినీరింగ్, తదితర విభాగాలకు చెందిన 56 ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఫెస్ట్‌ను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం రీజనల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్ ప్రియతో కలిసి ప్రాజెక్ట్‌లను తిలకించారు. కాగా పట్టణానికి చెందిన పలు పాఠశాలలకు చెందిన 9,10 తరగతుల విద్యార్థులు ప్రాజెక్ట్‌లను తిలకించారు. శుక్రవారం కూడా పాలిటెక్ ఫెస్ట్ కొనసాగనుంది. రుద్రకోట కళాశాల ప్రిన్సిపల్ ఏ సుశీల్‌కుమార్‌ప్రియ, విభాగాధిపతులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రాజెక్ట్‌లను తిలకిస్తున్న ఎమ్మెల్యే దీవీ కృష్ణారెడ్డి

నోడల్ అధికారులు బాధ్యతగా పనిచేయాలి

ఆత్మకూరురూరల్: ఈ నెల 7న పాఠశాలల్లో జరిగే మెగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశాలను విజయవంతంగా నిర్వహించేందుకు నోడల్ అధికారులుగా నియమితులైన వారు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల అధికారులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, డిజిటల్ అసిస్టెంట్‌లతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై పూర్తి స్థాయిలో చర్చించి నివేదికలు అందజేయాలని కోరారు. ఏఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మానవ మనుగడలో నేల కీలక పాత్ర

ఉదయగిరి: మానవ మనుగడ నేలమీదే ఆధారపడి ఉంటుందని, దానిని ఆరోగ్యవంతంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం కళాశాలలో ప్రపంచ నేలల దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన నేల పరిరక్షణ–సంరక్షణ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.సున్నితమైన నేల పైపొర దెబ్బతింటే వివిధ పంటల ఉత్పత్తి, దిగుబడి సామర్థ్యం తగ్గిపోతుందని, ఇది ఆహార భద్రతపై ప్రభావం చూపుతుందన్నారు. నేల మనకు స్వచ్ఛమైన నీటిని, జీవ వైవిధ్యాన్ని అందిస్తుందని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పందేలకు రెఢీ



- సంక్రాంతి సమీపిస్తుండడంతో
- పందెం కోళ్ల పెంపకం ప్రత్యేక శ్రద్ధ
- ప్రత్యేకంగా ఆహారం, శిక్షణ

ఇవీ రకాలు

కోడి పుంజుల్లో దాదాపు ముప్పై వరకు రకాలు ఉండగా, ప్రధానంగా 16 రకాలను పందేళ్లకు వినియోగిస్తారు. వాటి రకాలు, రంగుల ఆధారంగా కాకి, సేతు, పర్ల, సవల, కొక్కిరాయి, దేగ, నెమలి , కౌజు, మైల ,పూల ,పింగళ, నల్లబోర, ఎర్రప్రాడ, ముంగిస, అబ్రాసు, గేరువా తదితర రకాల పేర్లతో పిలుస్తారు. వాటి రంగులను బట్టి కూడా ధర ఆధారపడి ఉంటుంది.

కావలి: పందెంకోళ్లు పౌరుషానికి ప్రతిరూపాలు. కత్తికట్టి బరిలోకి దించితే 'తగ్గేదే లే' అంటూ ప్రత్యర్థిపై విరుచుకుపడతాయి. యజమాని పరువు కోసం ప్రాణాలను పణంగా పెట్టి కొట్లాడతాయి. సంక్రాంతికి కోళ్ల పందేలు ప్రత్యేకం. సంక్రాంతి సమీపిస్తుండడంతో కావలి, బోగోలు, అల్లూరు, జలదంకి, కలిగిరి మండలాల్లో పందెంకోళ్లను ప్రత్యేక శ్రద్ధతో పెంచుతున్నారు. పందెం కోళ్లను సిద్ధం చేయడం ఒక వ్యాపారం. చాలా మందికిదో జీవనోపాధి. చిన్నపిల్లగా ఉన్న కోళ్లను క్షుణ్ణంగా పరిశీలించి మరీ ఎంపిక చేసి ప్రత్యేకంగా సిద్ధం చేస్తారు. కోళ్లకు కత్తులు కట్టకుండా నిర్వహించే పందేలతో పాటు కత్తి కట్టి దించే పందేలు ఉంటాయి. కోడిపందేలలో వేటిని పడితే వాటిని బరిలో దించరు. మామూలు కోడిపుంజుల కంటే పందెం పుంజులు కాస్త భిన్నంగా, దృఢంగా ఉంటాయి. శరీర దారుఢ్యం, ఆకారం, రంగు, ఎత్తు, తోక, ఈకలు, తదితరాలను బట్టి పందెం పుంజులుగా నిర్ణయిస్తారు. పందెం పుంజులను గోదావరి జిల్లాల పందెం రాయుళ్లతో పాటు స్థానికంగా పందేలు నిర్వహించే వారికి విక్రయిస్తుంటారు. పుంజు రకం, వాటి సామర్థ్యాన్ని బట్టి ఒక్కొక్కటి రూ.20వేల నుంచి రూ.లక్ష వరకు విక్రయిస్తారు.

ప్రత్యేక ఆహారం, శిక్షణ

పందెం కోళ్ల పెంపకం ఎంతో శ్రమతో కూడుకున్న పని. అయినప్పటికీ వాటి పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. ప్రతిరోజూ వేకువజాము నుంచి రాత్రి పడుకునే వరకు వాటిని కంటికి రెప్పలా కాపాడుతారు. అవి అనారోగ్యం బారిన పడకుండా ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ నాణ్యమైన మందులు ఇస్తారు. మేత కూడా నిర్ణీత సమయంలో నిర్దిష్ట ప్రమాణంలో మాత్రమే ఇస్తుంటారు. ఉదయం ఉడికించిన కోడిగుడ్డులోని తెల్లటి జనను మాత్రమే తినిపిస్తారు. ఆ తరువాత బరిలో అలసట లేకుండా ఉండేందుకు పరిగెత్తిస్తారు. శరీరం గట్టిపడేలా చల్లటి నీటిలో ఈత కొట్టిస్తారు. ఆ తర్వాత పోషకాలు ఎక్కువగా ఉండే బాదం, పిస్తా, జీడిపప్పును మేతగా వేస్తారు. పోరాట సమయంలో గాయాలు తట్టుకుని నిలబడే విధంగా శరీరం గట్టిగా ఉండేలా వేడి నీటి ఆవిరితో కాకలు తీయిస్తారు. ఆ తరువాత మాంసాన్ని గుండ్రని ఉండలుగా చేసి వాటికి తినిపిస్తారు. కొన్ని కోళ్లకు బోన్‌లెస్ చికెన్ కూడా ఆహారంగా ఇస్తారు. కొవ్వు పట్టకుండా బరిలో చురుగ్గా ఉండేలా దంపుడు బియ్యం, రాగులు, మినపప్పు, శనగపప్పు, గోధుమలు కలిపిన మిశ్రమ ఆహారాన్ని అదనపు మేతగా అందిస్తారు.



కావలిలో పందేనికి పెంచుతున్న పుంజు

రేకుల షెడ్ కిందే బోధన



దుత్తలూరు: బోడవారిపల్లి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరి వర్షానికి ఉరుస్తుండడంతో గురువారం ఉపాధ్యాయులు రేకుల షెడ్డు కింద బోధన చేశారు. ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో తహసీల్దార్ నాగరాజు, ఎంఈఓ వెంగయ్య పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. ప్రత్యామ్నాయ భవనం ఏదైనా ఉందా అని ఆరా తీశారు. భవనం అందుబాటులో లేకపోవడంతో రేకుల షెడ్డులోనే తరగతులు నిర్వహించాలని సూచించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన భవనం మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పొదల్లోకి దూసుకెళ్లిన కారు

దుత్తలూరు: నందిపాడు వద్ద గురువారం కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న పొదల్లోకి దూసుకెళ్లింది. ఉదయగిరి నుంచి ఆత్మకూరు వైపునకు వెళ్తున్న కారు ఒక్కసారిగా అడ్డు వచ్చిన బైక్ ను తప్పించే క్రమంలో రోడ్డు పక్కనున్న పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు.

నూతన ఏసీ సినిమా థియేటర్ ప్రారంభం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నూతన శిరీష ఏసీ సినిమా థియేటర్‌ను గురువారం ప్రారంభించారు. తొలుత పుష్ప–2 సినిమాను ప్రదర్శించారు. ఫ్యాన్స్ షోకు రూ.500 చొప్పున టికెట్ వసూలు చేశారు. సాధారణ రోజుల్లో రూ.250 చొప్పున టికెట్ వసూలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వింజమూరులో తొలిసారిగా ఏసీ థియేటర్ అందుబాటులోకి రావడంతో సినీప్రేమికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

భోజన ప్యాకెట్ల పంపిణీ



కావలి: పట్టణంలోని బుడంగుంట ఇందిరమ్మ కాలనీలోని పేదలకు సంయుక్త సేవా సంస్థ సభ్యులు గురువారం భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు చిన్నారి సీహెచ్ శ్రీనిధి పుట్టినరోజు సందర్భంగా భోజనం ప్యాకెట్లు వితరణ చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర తెలిపారు.

చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలి

కావలి: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో గ్రామీణులకు 3 సెంట్లు, పట్టణ ప్రజలకు 2 సెంట్ల ఇళ్ల స్థలం ఇస్తానని మాట ఇచ్చారని గుర్తుచేశారు. గృహ నిర్మాణ వ్యయం పెరిగిందని, అందకనుగుణంగా రూ.4 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. వాటితో పాటు సూపర్‌సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నిందితుడి కోసం ముమ్మర గాలింపు

ఉదయగిరి: భార్యను హత్య చేసిన కేసులో నిందితుడైన మస్తాన్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలతో ముమ్మర గాలింపు చేపడుతున్నామని, త్వరలోనే పట్టుకుంటామని కావలి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. గురువారం ఆయన ఎస్సీకాలనీలో మృతురాలు ఇందిర ఇంటిని పరిశీలించి కుటుంబ సభ్యులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట సీఐ ఎన్ వెంకట్రావు, ఎస్సైలు ఇంద్రసేనారెడ్డి, ఏ శ్రీనివాసులు ఉన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన

వరికుంటపాడు: పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని ఏఓ వీ రవికుమార్ సూచించారు. మండలంలోని వరికుంటపాడు, కొండాయపాళెం గ్రామాల్లోని రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో పొగాకు పండించే బ్రెజిల్, చైనా, జింబాబ్వే వంటి దేశాల పొగాకు ఉత్పత్తులు, నిల్వలపై ఆధారపడి మన దేశంలో పండింగే పొగాకుకు ధర ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పొగాకు రైతులు శనగ, జొన్న, నువ్వులు, తదితర పంటలను సాగు చేపట్టాలని సూచించారు. శనగకు క్వింటాకు రూ.5650 , జొన్నకు రూ. 3421, కందికి రూ.7550, నువ్వులకు రూ.9,267 ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. ఏఈఓ కోటేశ్వరరావునాయక్, వీఏఏలు చంద్రశేఖర్, శారద మరియు రైతులు పాల్గొన్నారు.

చేజర్ల: రైతులు యాజమాన్య పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏఓ శశిధర్ అన్నారు. మడపల్లిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎరువులు, పురుగు మందుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. వరి నారును కొసలు తుంచి నాటుకుంటే పురుగు గుడ్లు తొలగిపోతాయన్నారు. తొలుత వేపనూనె పిచికారీ చేసుకోవాలని, చివరి దశలో పురుగు మందులను వాడాలని సూచించారు. చివరి దుక్కిలో 20 కేజీల జింక్ సల్ఫేట్ వేసుకోవాలని తెలిపారు. వీఏఏలు ఏ మమత, వీ హసన్‌కుమార్ పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీపై షేడ్‌నెట్, పాలీహౌస్‌లు

సంగం: ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా షేడ్‌నెట్, పాలీహౌస్‌ల నిర్మాణానికి 50 శాతం సబ్సిడీని అందజేస్తోందని సంగం ఉద్యాన శాఖ అధికారి పీ లక్ష్మి గురువారం తెలిపారు. షేడ్‌నెట్ హౌస్ నిర్మాణానికి ఎకరాకు రూ.28.4 లక్షలు, పాలీహౌస్ నిర్మాణానికి రూ.37.4 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెన్నా తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సోమశిల: సోమశిల జలాశయం దిగువన ఉన్న పెన్నా పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సోమశిల జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోందని తెలిపారు. ప్రస్తుతం జలాశయం నిండుకుండలా ఉందన్నారు. ఏ సమయంలోనైనా క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పెన్నానదిలోకి దిగొద్దని మత్స్యకారులు, పశువుల కాపర్లకు సూచించారు. వర్షాలు అధికంగా కురుస్తున్న కారణంగా వాగులు, వంకలు పొంగి చప్టాలపై ప్రవహించే సమయంలో దాటవద్దని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం

అనుమసముద్రంపేట: కావలియడవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు రూ.25వేలు విలువ చేసే క్రీడా పరికరాలను గురువారం అందజేశారు. అనంతరం క్రీడల్లో రాణించిన విద్యార్థులను అభినందించారు. పూర్వ విద్యార్థులు మద్దూరి తిరుపతయ్య, గోళ్ల వెంకటేశ్వర్లు, నాగినేని మస్తానయ్య, ఆళ్ల వివేకానంద, మన్నం మురళి, అయితా వెంకటేశ్వర్లు, మన్నం మహేంద్ర, గోళ్ల మల్లికార్జున, వల్లేటి మురళి, మాల్యాద్రినాయుడు, సర్పంచ్ ముప్పూరు ధనమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ జల్లి పాండురంగారావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం జే శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



చేజర్ల: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంఈఓ మస్తానయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. చేజర్ల స్కూలు కాంప్లెక్స్ హెచ్‌ఎం హైమావతి, ఐఈఆర్టీ షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజోత్సవం



అనుమసముద్రంపేట: అనుమసముద్రంలో హజరత్‌రెడి, వేణు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడి పూజోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు పెద్ద ఎత్తున పాల్గొని భజనలు చేశారు.

కూలిన పొగాకు బ్యారెన్

మర్రిపాడు: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మర్రిపాడులోని ఎర్రగంగు వెంకటేశ్వర్లు అనే రైతుకు చెందిన పొగాకు బ్యారెన్ గురువారం నేలకూలింది. సుమారు రూ.80 వేల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు పొగాకు బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

వసతి గృహాల్లో తనిఖీలు

సీతారామపురం: స్థానిక ఎస్సీ, బీసీ వసతి గృహాలను ఎంపీడీఓ భాస్కర్, ఈఓపీఆర్డీ భార్గవి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని సౌకర్యాలు, వసతులపై ఆరా తీశారు. స్టోర్ రూమును పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం రంగనాయుడుపల్లి వాగు వద్దకు చేరుకొని వాగు ఉధృతి తగ్గేంతవరకు రాకపోకలు నిషేధించాలని పోలీసులకు సూచించారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

కావలి: మండలంలోని అన్నగారిపాళెం అటవీప్రాంతంలో గుట్టుగా నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్సైలు బాజీబాబు, తిరుమలరెడ్డి, బాలకృష్ణ తమ సిబ్బందితో కలిసి దాడులు జరిపారు. ఈ దాడుల్లో నలుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఐదు కోళ్లు, రూ.7,250 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బస్సు, ఆటో ఢీ

ఆత్మకూరు: పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లి మలుపు వద్ద హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ఆటో గురువారం రాత్రి ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు వాహనాలు కొద్దిగా దెబ్బతిన్నాయి. ఆర్టీసీ సిబ్బంది, ఆటో డ్రైవర్ వాదోపవాదాలకు దిగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. స్థానికులు సర్దుబాటు చేయడంతో అరగంట తరువాత వాహనాలను కదిలించారు. అనంతరం ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సర్పంచ్ మృతిపై సంతాపం

వరికుంటపాడు: గణేశ్వరపురం సర్పంచ్ వడ్లపల్లి తిరుపతయ్య(70) బుధవారం అర్ధరాత్రి మృతి చెందారు. గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మరణించారు. సర్పంచ్ మృతిపై అధికారులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.